క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన యువమిత్ర యూత్



ఎమ్మెల్యే రవిశంకర్‌తో యువమిత్ర యూత్

బోయినపల్లి: మండల కేంద్రానికి చెందిన యువమిత్ర యూత్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. బోయినపల్లి వేములవాడ, బోయినపల్లి కొదురుపాక వెళ్లే దారుల్లో ఉన్న కల్వర్టుల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలు, ఆదర్శ పాఠశాలకు వెళ్లేందుకు పక్కా బీటీ రోడ్డు, ఓపెన్ జిమ్, ఫ్లడ్ లైట్లు, ఆరో వార్డులో సీసీ రహదారి తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బోయినపల్లిలో గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక అవకతవకలపై ఎమ్మెల్యేకు తెలిపినట్లు పేర్కొన్నారు.

ప్రారంభోత్సవాలు



అంబేడ్కర్ భవనానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

వీర్నపల్లి: మండల కేంద్రంలో గత సంవత్సరంలో పూర్తయిన పనులను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి ఆదివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.50 లక్షలతో అంబేడ్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం పల్లె ప్రకృతి వనం, రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, రూ.40 లక్షలతో నిర్మించిన రైతు వేదికను రూ.23.7 లక్షలతో రైతులకు సంబంధించిన గోదాంను ప్రారంభించారు. అనంతరం మద్దిమల్ల గ్రామానికి చెందిన గంగిపల్లి లక్ష్మణ్, వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన జక్కుల లింబాద్రికి ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కళావతి, ఎంపీపీ భూల, సెస్ డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ బోయిని రవి, బీఆర్‌ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి అన్నారం అజయ్ కుమార్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

గంభీరావుపేట: గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని సెస్ గంభీరావుపేట మండల డైరెక్టర్ గోరినేని నారాయణ రావు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో రూ. 2లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ప్రారంభించారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాయకులు అక్కపల్లి రాజనర్సింహారెడ్డి, వంగ సురేందర్ రెడ్డి, రాజనర్సు, నర్సింలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామ పంచాయతీ నూతన కార్యాలయాన్ని ఆదివారం సర్పంచ్ ముదారి పోచయ్య, ఎంపీటీసీ సిలివేరి ప్రసూన ప్రారంభించారు. ఉపసర్పంచ్ గజ్జెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఆడెపు శశికళ, పంతం నాగలక్ష్మీ, బెంద్రం పవన్, భాగ్యలక్ష్మీ, మచ్చ వంశీ, సామల సునీత, కొండ రాజు, నాయకులు పాల్గొన్నారు.

విలీనంలో అన్నీ సమస్యలే..

- గుంతల రోడ్లతో ఇబ్బందులు
- మురుగు నీటి కాలువల కంపు
- ఇబ్బందిపడుతున్న తిప్పాపూర్ కాలనీవాసులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు తమ సమస్యలను గ్రామపంచాయతీలోకి వెళ్లి చెప్పుకుని పరిష్కరించుకునే వాళ్లం. కాని మున్సిపల్‌లో విలీనమయ్యాక తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. తమ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిపినా కూడా పట్టించుకోవడం లేదని, తాము అధికారుల వద్దకు పోలేక సమస్యలు ఎక్కడికి అక్కడే ములుగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పట్టించుకుని వార్డుల్లో పర్యటించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



తిప్పాపూర్‌లో గుంతలమయంగా రోడ్డు



డ్రైయినేజీలో పేరుకుపోయిన మురుగు

అధ్వానంగా సీసీ రోడ్లు

తిప్పాపూర్‌లో గతంలో వేసిన రోడ్లు అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసిన గుంతలు, కంకర తేలి పాదచారులు నడిచే పరిస్థితి లేదు. అసలే చిన్న గల్లీలు అందులో రోడ్డు బాగలేక వాహనదారులు కిందపడుతున్నారని అంటున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకు రోడ్డుపై నడవాల్సిందే. కాలు వెస్తే పోటు రౌతులు తగిలి ఆసుపత్రులపాలవుతున్నమని ఆవేదన చెందుతున్నారు.

➡ గ్రామపంచాయతీ భవనం నుంచి పోచమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు అధ్వానంగా ఉంది.

➡ లింగారెడ్డి ఇంటి నుంచి మల్లయ్య ఇంటి వరకు సీసీ రోడ్డుపై మట్టి ఉండటంతో ఎక్కడి నీరు అక్కడే అగి బురదమయంగా ఉంది.

➡ హతాహార్ ఇంటి నుంచి సింగం దేవయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు లేదు.

కంపుకొడుతున్న డ్రైయినేజీలు

తిప్పాపూర్‌లో ఏళ్ల కింద నిర్మించిన మురుగు నీటి కాలువలు చిన్నగా ఉండటంతో మురుగు ఎక్కడికక్కడే అగుతున్నాయి. కనీసం మురుగు నీటి కాలువలు కూడా శుభ్రం చేయడం లేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.

- మరాఠి వెంకటి ఇంటి నుంచి నిమ్మోర్లై వరకు మురుగు నీటి కాలువ లేదు.
- రాజధాని దాబా నుంచి చర్చి వరకు మురుగు నీటి కాలువల్లో నీరు అగి మురుగు నీరు రోడ్డుపై పారుతున్నాయి.
- రోడ్డుపై నీరు పారడంతో ఏరియా ఆసుపత్రికి వచ్చే ప్రజలకు కంపు భరించలేకపోతున్నారు.
- అదరవేణి కొమురయ్య ఇంటి గల్లీలో ఇటీవల నిర్మించిన మురుగు నీటి కాలువ సక్రమంగా లేక మురుగు నీరు అందులోనే ఆగుతుంది.
- హనుమాన్ ఆలయం నుంచి సత్తయ్య ఇంటి వరకు మురుగు నీటి కాలువల్లో నీరు రోడ్డుపై పారుతున్నాయి.
- పోచమ్మ ఆలయం నుంచి మూలవాగు వరకు మురుగు నీటి కాలువ కూలి మురుగు నీరు నిలిచి పోతుంది.
- తిప్పాపూర్ బస్టాండ్‌కు, పక్కన ఇళ్లకు ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో లోవోల్టేజీ విద్యుత్‌తో ఇళ్లల్లో కూలర్లు, ఫ్యాన్లు కాలిపోతున్నాయి.

రోడ్డు అధ్వానంగా ఉంది



తిప్పాపూర్‌లోని కాలనీల్లో రోడ్లు మొత్తం గుంతలుగా మారాయి. అసలే చిన్న గల్లీలు అందులో రోడ్డు బాగలేక వాహనదారులు కిందపడుతున్నారు. పాదచారులకు పోటు రౌతులు తగిలి గాయాలపలవుతున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నాం.

– దేవవ్వ, తిప్పాపూర్

మురుగు కంపుకొడుతోంది



డ్రైయినేజీలు ఎప్పుడో కట్టినవిగా కావడం, అలాగే అవి ఇరుకుగా ఉండి మురుగు నీరు ఎక్కడికక్కడే అగి కంపుకొడుతున్నాయి. ఇంటి ముందుకు రావాలంటే కంపుభరించలేక పోతున్నాం. మురుగు నీటి కాలువలు శుభ్రం చేయాలని కోరుతున్నాం.

– లచ్చవ్వ, తిప్పాపూర్

సమస్యలను పట్టించుకునే వారు లేరు



తిప్పాపూర్‌లో సమస్యలు ఉన్నాయని చాలాసార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు అయిన పట్టించుకుని డ్రైయినేజీ, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాము.

– శంకర్‌రెడ్డి తిప్పాపూర్

రోడ్డుపై నీరు పారుతోంది



తిప్పాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఎదుట మిషన్ భగీరథ పైపుల నీరు లీకేజీతో రోడ్డుపై పారుతోంది. పాఠశాల విద్యార్థులు ఆ నీటిలో నుంచి రావడంతో జారి పడుతున్నారు. అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేయాలని కోరుతున్నాం.

– శ్రీనివాస్ తిప్పాపూర్

ముంపుగ్రామాల సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- సన్మానించిన సంకెపల్లి నిర్వాసితులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాసితులు

వేములవాడ: ముంపు గ్రామాల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లికి చెందిన ముంపు గ్రామ నిర్వాసితుల కుటుంబాలు సర్పంచ్ జింక సునీత ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలుసుకుని ఘనంగా సన్మానించారు. మిడ్ మానేరు ముంపునకు గురైన 45 కుటుంబాల కోసం ఎమ్మెల్యే చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో ఇళ్ల నష్టపరిహారం కొరకు రూ.14 కోట్లు విడుదల కానున్నాయని, ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. సంకేపల్లి గ్రామాన్ని ముంపుగ్రామంగా ప్రకటించడంలో మంత్రి హరీశ్ రావు కృషిని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, వైస్ ఎంపీపీ ఆర్సీ రావు, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, అనుపురం సర్పంచ్ వెంకటరమణరావు, సంకేపల్లి ఉపసర్పంచ్ పర్శ రాములు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందులు చూడలేక..

- కొట్టుకుపోయిన దారిలో మట్టి పోయించిన డీసీసీ అధ్యక్షుడు



రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న నాయకులు

చందుర్తి: చెరువు మత్తడి నీటితో కొట్టుకుపోయిన దారిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూడలేక డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తన సొంత డబ్బులతో ఆదివారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. మండలంలోని కట్టలింగంపేట గ్రామంలోని గురున్నాథం చెరువు మత్తడి నీటితో కట్టలింగంపేట గ్రామంలోని 4వ వార్డులో రోడ్డు రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేస్తారని ఎదురుచూసి విసిగిపోయి, గ్రామస్తులే తాత్కాలికంగా విరిగిన విద్యుత్ స్తంభాలను వేసుకుని నడిచేందుకు వీలుగా ఏర్పాటు చేసుకున్నారు. కాగా శనివారం రుద్రంగి వైపు వెళుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రమాదపుటంచున నడుస్తున్న ప్రజలను చూసి చలించిపోయి అతను సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో కట్టలింగంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ట్రాక్టర్‌తో మొరం పోయించి రోడ్డును చదను చేయించారు. దీంతో ఇచ్చిన హామీని ఆది శ్రీనివాస్ ఒక్కరోజులోనే తీర్చారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

గొర్రెలు ఇప్పించండి సారూ



ఇల్లు ఇప్పించాలని వేడుకుంటున్న వృద్ధురాలు

ముస్తాబాద్: 'సారూ ఆరు నెలల సంది గొర్రెలు వత్తయని ఎదురుచూస్తున్నం.. పైసలు కట్టినం అయిన గొర్రెలు ఇస్తలేరు మీరే ఆదుకోవాలి..' అంటూ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించగా, ఈమేరకు గొల్ల కురుమలు కలిసి విజ్ఞప్తి చేశారు. 108 మంది రూ.43 వేలు చొప్పున చెల్లించారని పేర్కొన్నారు. అప్పులు చేసి డీడీలు ఇచ్చామన్నారు. త్వరలోనే అందరికి గొర్రెలు వస్తాయని ఈమేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. పక్షం రోజుల్లో గొర్రెలు వచ్చేలా అధికారులతో మాట్లాడుతామన్నారు. ఎవరు ఆందోళన చెందవద్దన్నారు.

ఇల్లు ఇప్పించాలని మహిళ..

సిరిసిల్లఅర్బన్: డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించాలని పట్టణంలోని 29వ వార్డుకు చెందిన బైరవేణి భారతి ఆదివారం కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ని వేడుకుంది. 20 ఏళ్ల నుంచి కిరాయి ఇంటిలో నా భర్తతో పాటు ఉంటున్నానని డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పించాలని కన్నీటి పర్యంతమై గోడు వెల్లబోసుకుంది. చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇల్లు రాలేదని, తనకు పిల్లలు కూడా లేరని, బీడీ పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్నానని, డబుల్ బెడ్రూం ఇల్లు ఇప్పించాలని వినతిపత్రాన్ని అందజేసింది.

సంక్షిప్త వార్తలు

ఆత్మగౌరవ సభకు తరలిన ముదిరాజ్‌లు



వేములవాడఅర్బన్/రుద్రంగి/ముస్తాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌లకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో తలపెట్టిన ముదిరాజు ఆత్మగౌరవ సభకు జిల్లా వ్యాప్తంగా ముదిరాజులు భారీగా తరలివెళ్లారు. చట్టసభల్లో ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు అవకాశాలు కల్పించాలని కోరారు. ముదిరాజ్ సంఘం నాయకులు గజ్జెల రాజు, నరేశ్, చిగురు వెంకన్న, రాజలింగం, అంజనేయులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

తంగళ్లపల్లి: సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన చైర్మన్‌గా నియామకమైన పూసపెల్లి సరస్వతిని ఆదివారం మాజీ ఏఎంసీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా సరస్వతి దంపతులను రవీందర్ రెడ్డి దంపతులు శాలువాతో సత్కరించి వేములవాడ రాజన్న ఆలయ ప్రసాదాన్ని అందజేశారు.

గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు పత్రాలు అందజేత

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్‌లో 30 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోతె రాజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, ఎంపీటీసీ పర్శరాములు, ఉపసర్పంచ్ దేవేంద్రం, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు రూ.2.15 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీపీ పడిగెల మానస ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోడి అంతయ్య, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి రూ. 4 లక్షలు

బోయినపల్లి: మండల కేంద్రంలో మినీ స్టేడియంకు వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణం కోసం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రూ.4 లక్షల నిధుల ప్రొసీడింగ్స్ కాపీని ఆదివారం అందించినట్లు బీఆర్‌ఎస్ నాయకులు గుంటి శంకర్ తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు..

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్లతిమ్మాపూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వివిధ వ్యాధులతో బాధపడుతున్న 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరానికి పెద్ద ఎత్తున గ్రామస్తులు తరలివచ్చారు. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 152 మందికి రక్త పరీక్షలు చేశారు. వైద్యం అత్యవసమైన వారిని ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పయ్యావుల రామచంద్రం, సెక్రటరీ నాయిని భాస్కర్, ట్రెజరర్ మల్లారెడ్డి, సభ్యులు పెంజర్ల రవి, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

కోనరావుపేట: మండలం మామిడిపల్లిలో పలువురు బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పరామర్శించారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు తక్కళ్ల ఎల్లారెడ్డి మామ మృతి చెందగా, జోగినిపల్లి రవీందర్ తల్లి మృతి చెందగా, కులేరు శ్రీనివాస్ కుటుంబాన్ని, ఎల్లెటి లక్ష్మారెడ్డి భార్య మృతి చెందగా ఆ కుటుంబాలను ఆదివారం పరామర్శించారు.

మాజీ జెడ్పీటీసీకి

ముస్తాబాద్: ముస్తాబాద్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిని, బందనకల్ సర్పంచ్ వెంకటేశ్వరిలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, బీసీ స్టడీస్ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరు.. కాంగ్రెస్ ప్రచార జోరు

- ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం



బీవైనగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న సంగీతం శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: పేదల సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సంగీతం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం సిరిసిల్లలోని బీవైనగర్‌లోని కార్మిక వాడల్లో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై ఇంటింటా ప్రచారం చేసి మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిందేమి లేదని మరోసారి ఆపార్టీకి ఓటేస్తే పేదల బతుకులు మరింత ఆగమైతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, సంగీతం శ్రీనాథ్, వెంగల అశోక్, రెడ్డిమల్ల భాను పాల్గొన్నారు.

మల్యాలలో ఆది శ్రీనివాస్ ప్రచారం

చందుర్తి: కాంగ్రెస్ పార్టీ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలపై డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ చందుర్తి మండలం మల్యాల గ్రామంలో ఆదివారం గడపగడపకు ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 80 మందికి పైగా యువకులు కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. తొమ్మిదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతోందన్నారు. రైతులకు పండించిన పంటలకు మద్దతు ధరతో పాటు బోనస్‌ను ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, రైతుల సంక్షేమం కోసం పాటుపడే పార్టీని రైతులందరూ కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతూ, పార్టీని ఆదరిస్తున్నారని, రైతులను తమ పార్టీ ఎప్పుడు విస్మరించబోదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

పనులు పూర్తికాకున్నా ప్రారంభిస్తారా



మాట్లాడుతున్న సురేందర్‌రావు

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో ఇప్పటి వరకు పనులు పూర్తికాని రిజర్వాయర్‌ను ఎలా ప్రారంభిస్తారని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేట ప్రాజెక్టును ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలక్పేట రిజర్వాయర్ ఎవరి ప్రయోజనం కోసం నిర్మించారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్‌తో కోనరావుపేట మండలం కంటే సిరిసిల్ల నియోజకవర్గానికే అధిక ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రాజెక్ట్‌లో కాలువల పనులతో పాటు ఇతర పనులు కూడా పూర్తి కాలేదన్నారు. కోనరావుపేట మండలంలో ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కూడా కట్టివ్వలేకపోయారన్నారు. పనులు పూర్తి చేయని ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, నాయకులు తిరుపతి, బాలాజీ, నాగరాజు, సురేశ్, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, ఎంపీటీసీ ఇస్తారి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పవర్‌కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: వేములవాడ మండలం 33 నంది కమాన్ ఫీడర్‌లో పీఎంఐ (ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్) ఉన్నందున మండలంలోని బోయినపల్లి, విలాసాగర్, వెంకట్రావుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సబ్‌స్టేషన్ల పరిధిలోని బోయినపల్లి, తడగొండ రోడ్డు సైడ్, రామన్నపేట, రత్నంపేట, దేశాయిపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, వెంకట్రావుపల్లి, నర్సింగాపూర్, మాన్వాడ, కొత్తపేట, మల్లాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నియామకం

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లారెడ్డి

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శిగా వంగ మల్లారెడ్డిని నియమించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన మల్లారెడ్డిని నియమిస్తూ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి నియామకపు పత్రాన్ని పంపించారు. తన నియామకానికి సహకరించిన సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మల్లారెడ్డికి మండల పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ అభినందించారు.

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూరెల్లి రాంచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మానుక రాములు, ఎర్ర వేణుగోపాల్‌గౌడ్ ఎన్నికైనట్లు మండల శాఖ అధ్యక్షుడు హమీద్ తెలిపారు.

ఆలయ కమిటీ కార్యవర్గం

వేములవాడఅర్బన్: పంచముఖ శ్రీ హనుమాన్ ఆలయం అభివృద్ధి కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు. చైర్మన్‌గా వంగల శ్రీనివాస్, అధ్యక్షుడిగా జంగిటి సంజీవ్, ఉపాధ్యక్షుడిగా మ్యాన సంతోష్, కోశాధికారులుగా శేఖర్, భూపతి, బాలకృష్ణ, కార్యదర్శులుగా భూమేశ్, రాజేశ్, రవి, ముఖ్య సలహాదారులు ప్రకాశ్, దేవరాజు, మల్లికార్జున్, శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు గణేశ్, మధు, రాజు, సతీశ్‌రెడ్డి, మహేశ్, సురేశ్, నరేశ్, మోహన్, సంతోష్, శ్రీనివాసరావు, రమణరావు, రామకృష్ణ, శేఖర్, దీపక్‌ను నియమించినట్లు తెలిపారు.

వడ్డెర సంఘం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల రూరల్ వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివరాత్రి కనుకయ్య, ఉపాధ్యక్షులుగా ఒల్లెపు రాజయ్య, వేముల రాములు, ప్రధాన కార్యదర్శి కొడుదల మల్లేశం, కార్యదర్శి పల్లపు మల్లేశం, సూర రాజు, కోశాధికారి నాగరాం ఐలయ్య, ముఖ్య సలహాదారు వెంకటిని ఎన్నుకున్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

సిరిసిల్ల: మున్సిపల్ పరిధి చంద్రంపేట, రగుడులో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు స్థానిక ప్రజాప్రతినిధులు బతుకమ్మ చీరలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాతూరి రాజిరెడ్డి, పోచవేణి సత్య, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్, కొత్తపేట, వరదవెల్లి, వెంకట్రావుపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచులు ఇల్లెందుల శంకరయ్య, ల్యాద నవ్య, ఆరెపల్లి లత, బూర్గుల నందయ్య పాల్గొన్నారు.

నిర్వాసితుల హామీలు నెరవేర్చాలి

కోనరావుపేట: మండలం మల్కపేట రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని యూత్ కాంగ్రెస్ నాయకులు పాకాల కార్తీక్‌గౌడ్ అన్నారు. మల్కపేటలో ఆదివారం మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్వాసితులకు బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, డబుల్ బెడ్రూమ్, అర్హత ఉన్నవారికి ప్రభుత్వ ఉద్యోగం తదితర హామీలు ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు ఒక్కటి కూడా నెరవేర్చలేరన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు.